అంతా కొత్త

ఏలూరు, నరసాపురం ఎంపీ సీట్లలో కొత్త ముఖాలు

- తొలిసారి పోటీకి ప్రధాన పక్షాల అవకాశం
- ఉద్ధండులు ఢీకొన్న నరసాపురంలో నవతరం
- కాంగ్రెస్ నుంచి బాపిరాజు నిలబడతారా ?

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి కూటమి ఏలూరు, నరసా పురం లోక్‌సభ స్థానాల్లో శంఖారావం పూరిస్తోంది. ఈ నియోజకవర్గాల పరిధిలో పోటీకి దిగిన అభ్యర్థుల్లో నరసా పురం బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ మినహా మిగతా ప్రధాన పక్షాల అభ్యర్థులంతా కొత్తముఖాలే. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎంపీ సీట్లలో రాజకీయ స్వరూపమే మారిపోయింది. ఈసారి పోటీ వైసీపీ, ప్రధాన కూటమి అభ్యర్థుల మధ్యే హోరాహోరీగా జరగనుంది.



ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ నాయకుల పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి మహేష్

ఏలూరు లోక్‌సభలో యువ కెరటం

ఏలూరు లోక్‌సభా స్థానం నుంచి టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా వ్యాపార రీత్యా పట్టున్న, రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌ను బరిలోకి దింపారు. మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడైన ఆయన కడప జిల్లా మైదుకూరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న పుట్టా సుధాకర్ తనయుడు. రెండు కుటుంబాలూ రాజకీయ నేపథ్యం కలిగి వుండడంతో చంద్రబాబు మహేష్‌కు అవకాశం ఇచ్చారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఎలాగూ రామకృష్ణుడికి పట్టు ఉంది కాబట్టి, ఈసారి ఏలూరులో తమ అభ్యర్థికి ప్రత్యేక అదనపు అర్హత అవుతుందని అంచనా వేస్తున్నారు. ఆయన ముఖ్యనేతలతో భేటీ అయినపుడు ఎలాంటి తడబాటు లేకుండా తాను గెలిస్తే నియోజకవర్గానికి ఎలాంటి మేలు చేస్తానో స్పష్టంగా వివరించారు. ఇదే స్థానం నుంచి పోటీ చేయాలనుకున్న లోక్‌సభ ఎన్నికల్లో సీనియర్ అయిన మాగంటి బాబును పక్కనబెట్టారు. నాలుగు రోజులుగా ఆయన ఎవరికీ అందుబాటులో లేకపోవడం, సోమవారం మహేష్ పరిచయ కార్యక్రమానికి దూరంగా ఉండడంతో కొందరి మధ్య చర్చకు దారితీసింది. తగు సమాచారంతోనే ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారా.. వ్యక్తిగత పనుల మీద రాలేకపోయారా అనేది తేలలేదు. ఇదే లోక్‌సభా స్థానం పరిధిలో తొలిసారిగా పోటీ చేస్తున్న మహేష్ కుమార్‌తో తలపడనున్న వైసీపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ లోక్‌సభ ఎన్నికల బరిలో దిగడం కొత్తే కావడం యాదృచ్ఛికం. కావూరి సాంబశివరావు, బోళ్ళ బులిరామయ్య, కొమ్మారెడ్డి సూర్యనారాయణ, మాగంటి బాబు, సూపర్‌స్టార్ కృష్ణ వంటి వారు ఈ స్థానం ఇంతకుముందు గెలుపొందారు. ఇపుడు ఆ తరం అంతా తెరమరుగు కాగా మాగంటి బాబు మాత్రం ఈసారి తాను పోటీకి సిద్ధమని ముందుకెళ్ళినా అవకాశం ఇవ్వలేదు. ఏలూరు స్థానం పరిధిలో ప్రధాన పక్షాలు బీసీ నినాదం అందుకోవడం ఈసారి విశేషం.

నరసాపురంలోనూ నవ శకం..

నరసాపురం లోక్‌సభా స్థానం పరిధిలో ఈసారి నవశకం లోక్‌సభ బరిలో పోటీకి నిలిచింది. తాజాగా ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీకి చెందిన భూపతిరాజు శ్రీనివాసవర్మ రంగంలో నిలిచారు. 2009 ఎన్నికల్లో ఆయన ఇదే స్థానం నుంచి పోటీకి నిలిచారు. ఆయనకు రెండోసారి బీజేపీ అవకాశం ఇచ్చింది. ఇక్కడి నుంచి పోటీ చేయడం తమ రాజకీయ ప్రతిష్ఠకు సంకేతంగా అక్కడి నేతలు భావిస్తారు. ఒకప్పుడు భూపతిరాజు విజయకుమార్‌రాజు, బలరాజు, కొత్తపల్లి సుబ్బారాయుడు, చేగొండి హరిరామజోగయ్య, కనుమూరి బాపిరాజు, రెబల్‌స్టార్ కృష్ణంరాజు, గోకరాజు గంగరాజు, గత ఎన్నికల్లో రఘురామకృష్ణంరాజు ఈ స్థానం నుంచే గెలుపొందారు. నరసాపురం నుంచి ఎన్నికైన వారంతా రాజకీయాల్లో రాటుదేలడం, రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో ఆసాంతం ప్రముఖంగా ఉంటారు. అలాంటి అవకాశాన్ని తాజాగా బీజేపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ చేజిక్కించుకుని పోటీకి దిగారు. మరోవైపు వైసీపీ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన గూడూరి ఉమాబాలను రంగంలోకి దించారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె లోక్‌సభ ఎన్నికల బరిలో నిలవడం ఇదే ప్రథమం. గతంలో మునిసిపల్ రాజకీయాలకే పరిమితమైన ఆమెకు ఈసారి వైసీపీ పోటీ చేసే అదృష్టం కల్పించింది.

• ఎంపీ రఘురామ వైపే.. అందరిచూపు



సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు నరసాపురం నుంచి ఏదొక పార్టీ తరఫున పోటీ చేసే ఉద్దేశం ఉన్నా అది నెరవేరలేదు. నరసాపురం బీజేపీ నుంచి ఆయనకు సీటు దక్కడం ఖాయమని అందరూ ఊహించినా, దీనికి విరుద్ధంగా ప్రతికూల ప్రకటనలు వచ్చాయి. ఇప్పుడందరి దృష్టి రఘురామపైనే పడింది.

తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో విజయనగరం పార్లమెంటరీ స్థానం నుంచి పోటీ చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఇన్నాళ్లూ వైసీపీని ఎదిరించి నిలిచినా, ఆయన విషయంలో ఇప్పటి వరకు చోటు చేసుకున్న పరిణామాలను కొందరు తప్పు పడుతున్నారు. ఆయన వచ్చే రోజుల్లో ఎవరూ ఊహించని రీతిలో తాను ముందుకు దూసుకుపోతానని ప్రకటించారు. ఒకవేళ విజయనగరం లోక్‌సభ నుంచి అవకాశం ఇస్తే సరే, లేకుంటే మరేదైనా అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం లేకపోలేదు. నరసాపురం లోక్‌సభా స్థానం పరిధిలోనే ఉన్న అసెంబ్లీ స్థానం నుంచే వీలైతే ఆయన పోటీకి దిగుతారంటూ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

• కాంగ్రెస్‌లో బాపిరాజు సంగతేంటి ?



కాంగ్రెస్ అభ్యర్థులుగా లోక్‌సభ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయమై ఆసక్తి ఆరంభమైంది. మొదటి నుంచి నరసాపురం నుంచి పోటీకి దిగిన మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత కనుమూరి బాపిరాజు అడుగులు ఎటు వేయబోతున్నారనే దానిపై అందరి నోటా ప్రశ్నగా మారింది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల నియామకం తర్వాత ఏలూరు లోక్‌సభ స్థానం కన్వీనర్‌గా బాపిరాజు, నరసాపురం లోక్‌సభా స్థానానికి జెట్టి గురునాథరావును నియమించారు. వీరిలో గురునాథరావు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి వైసీపీలో చేరారు. కాంగ్రెస్‌లోనే ఉన్న బాపిరాజును తిరిగి క్రియాశీలక రాజకీయాల్లోకి రప్పించి ఆయనను తిరిగి నరసాపురం నుంచే పోటీకి దించుతారా లేదా అనేది తేలాల్సి ఉంది. కాంగ్రెస్ జాబితాను ఏఐసీసీ ఆమోదానికి జాబితా పంపాల్సి ఉన్నా ఇప్పటి వరకు సాధ్యం కాలేదు. ఏలూరు ఎంపీగా పోటీ చేసేందుకు అర డజను మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇదంతా నెలాఖరుకు గానీ తేలకపోవచ్చు.

అవినీతి సామ్రాట్ !



(భీమవరం- ఆంధ్రజ్యోతి)

మునిసిపల్ అధికారి దందా

- అధికార పార్టీ నేతకు అడ్డగోలు సేవలు
- కోట్ల విలువైన టీడీఆర్ బాండ్‌ల జారీ
- నాలుగు వేల చదరపు గజాలు మంజూరు
- అమ్ముకున్న రియల్టర్.. పక్కా స్కెచ్‌లు
- మాస్టర్ ప్లాన్ రహదారి పేరుతో బాండ్‌లకు ప్రణాళిక

మాస్టర్ ప్లాన్‌లు అధికార పార్టీ నేతలకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఆ పట్టణంలో పని చేస్తున్న ఓ ముఖ్య అధికారి అక్కడి అధికార పార్టీ నేతకు అడ్డగోలుగా సేవలు చేస్తున్నారు. ఆ నేత చెప్పినట్టు టీడీఆర్ బాండ్‌లు జారీ చేసి, కోట్ల రూపాయల చేతులు మారే విధంగా వ్యూహం రచించారు. జిల్లాలోని వాణిజ్య కేంద్రమైన పట్టణంలో ఒక రియల్టర్ వేసిన వెంచర్‌కు మాస్టర్ ప్లాన్‌లో 60 అడుగుల రహదారి ఉంది. అక్కడ నిర్మాణాలు చేపట్టాలంటే ప్లాన్ మంజూరుకావాలి. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రహదారి విడిచిపెట్టాలి. అప్పుడే ప్లాన్ మంజూరవుతుంది. కానీ ఆ పట్టణంలోని ముఖ్య అధికారి మాస్టర్ ప్లాన్ రహదారి అభివృద్ధి కోసమని స్థలాన్ని సేకరించే ప్రక్రియ చేపట్టారు. అక్కడ ఎటువంటి నివాసాలు లేవు. రియల్టర్ వేసిన వెంచర్ వరకు పట్టణం అభివృద్ధి చెందాలంటే కొన్నేళ్లు పడుతుంది. పట్టణంలో రహదారుల విస్తరణ, అభివృద్ధికే నిధులు లేవు. అలాంటిది పట్టణానికి దూరప్రాంతంలో 60 అడుగుల మాస్టర్‌ప్లాన్ రహదారి కోసం మున్సిపాలిటీ స్థలం సేకరించడం హాస్యాస్పదంగా ఉంది. మాస్టర్ ప్లాన్ రహదారికి అనుగుణంగా దాదాపు 1000 గజాల స్థలాన్ని సేకరించారు. అందుకు ప్రతిగా 4000 గజాలకు టీడీఆర్ బాండ్‌లు జారీచేశారు. వాటి విలువ రూ.6 కోట్లు పైమాటే. మున్సిపాలిటీకి అప్పనంగా అప్పగించాల్సిన చోట ఇంత విలువైన బాండ్‌లు జారీ చేయడం విమర్శలకు దారితీస్తోంది. పట్టణ ప్రధాన మార్కెట్‌లో ఓ మార్వాడి వ్యాపారి షాపులకు అనుకుని 40 అడుగుల రహదారిని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. ఇందుకు టీడీఆర్ బాండ్‌ల జారీ చేయనున్నారు. వ్యాపారితో అధికార పార్టీ నేత సంప్రదింపులు పూర్తిచేశారు. వ్యాపారికి రూ.8 కోట్లు ఇచ్చేలా ఒప్పందం కుదిరినట్టు సమాచారం. ఆయన పేరుతో జారీ అయ్యే బాండ్‌లు అధికార పార్టీ నేతకు వెళ్లనున్నాయి. సదరు ప్లాన్ రహదారి పేరుతో దాదాపు మరో రూ.10 కోట్లు ప్రయోజనం సమకూరుతుంది.

కోడ్ అడ్డంకి కాదు !

ఎన్నికల కోడ్ ఉన్నా టీడీఆర్ బాండ్‌లు ఇవ్వడానికి ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. పట్టణంలో అధికారిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కొత్త మాస్టర్‌ప్లాన్ రహదారికి టీడీఆర్ బాండ్‌లు ఎంత మేర మంజూరు చేస్తారనేది ప్రశ్నార్థకం. అయినప్పటికీ ఆ అధికారి.. నేను మోనార్క్‌ను... నన్ను ఎవరూ ఏమి చేయలేరు అంటూ రంకెలేస్తున్నారు. మరోవైపు టీడీఆర్ బాండ్‌ల జారీ మాత్రం కమిటీ ఆమోదంతోనే చేసినట్టు చెబుతున్నారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా కమిటీ అంటూ కొత్త ఒరవడికి తెరలేపారు. మున్సిపాలిటీలకు బాధ్యత వహించే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారితో ఇది పూర్తయితే భారీగా కాసులు ముట్టచెప్పేలా ఒప్పందం కుదిరింది.



ఫ్యూజులు పీకేశారు



- అంధకారంలో ఆకివీడు మున్సిపాలిటీ
- రూ.1.60 కోట్లు విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేత

ఆకివీడు/పెంటపాడు, మార్చి 25 : కోట్ల రూపాయల విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయ ఫ్యూజులు పీకేశారు. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1.60 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులు నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడంతో శనివారం రాత్రి పంచాయతీ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినట్లు ఏఈ ప్రదీప్ సోమవారం తెలిపారు. కుప్పనపూడి, అజ్జమూరు, మందపాడు, అయి-భీమవరం, చెరుకుమిల్లి పంచాయతీలు రూ.40 లక్షల బకాయిలు ఉండడంతో అయి భీమవరం, చెరుకుమిల్లి మినహా మిగిలిన మూడు పంచాయతీల్లోనూ కరెంటు కట్ చేశారు. అయి-భీమవరం, చెరుకుమిల్లి మంగళవారంలోగా చెల్లించకపోతే వాటిని సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

19 పంచాయతీల బిల్లులు పెండింగ్

పెంటపాడు మండలంలో 22 గ్రామాలు ఉన్నాయి. వీటిలో దర్శిపర్రు, రాచర్ల, ముదునూరు గ్రామ పంచాయతీలు మాత్రమే విద్యుత్ బకాయిలు చెల్లించారు. మిగిలిన 19 గ్రామ పంచాయతీ కార్యాలయాలు రూ.6,34,98,307 బకాయిలు చెల్లించాలి. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వచ్చిన బకాయి రూ.1,49,85,342 చెల్లించాలని ప్రతీ పంచాయతీకి నోటీసులు పంపినట్లు విద్యుత్ ఏఈ జె.పద్దరాజు తెలిపారు. బిల్లులు చెల్లించకుంటే ఆయా కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

ఆకివీడు సీహెచ్‌సీకి సుస్తీ!

ఆసుపత్రికి వైద్యులు వేళకు రారు.. రోగులను చూడరు

- వైద్యం కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు
- ఆరుగురు డాక్టర్లపైన రోగుల అసహనం
- పట్టించుకోవాలని ఉన్నతాధికారికి ఫిర్యాదు

ఆకివీడు, మార్చి 25 : 'అనారోగ్యంతో బాధపడుతున్న మేం సుమారు 20 కిలోమీటర్ల దూరం నుంచి మూడు ఆటోలు మారి.. ఆసుపత్రికి వచ్చాం. ఉదయం పదిన్నర అవుతున్నా డాక్టర్‌లు రాలేదు. గంటల తరబడి నిరీక్షించినా పట్టించుకొనే వారే లేరు. ఉదయం 11 గంటలు దాటితే బయట ఎండలు మండుతున్నాయి. డాక్టర్లు వచ్చిన తర్వాత పరీక్షించుకుని ఇంటికి ఎండలో వెళ్ళాల్సిన పరిస్థితి. మాకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు' అంటూ అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆకివీడు 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో ఉదయం తొమ్మిది గంటలకు రావాల్సిన వైద్యులు సోమవారం పదిన్నర దాటినా రాకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణతో పలువురు ఫోన్‌లో మాట్లాడి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ఆరుగురు వైద్యులున్నా సరిగా స్పందించడం లేదని వాపోయారు. మహిళా వైద్యురాలు రౌండ్స్‌లో ఉన్నట్లు నర్సులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఆసుపత్రిలో ఖాళీగా వున్న వైద్యుల కుర్చీలు

• వచ్చి గంటపైనే అయ్యింది



ఎండ తగలకుండా వైద్య పరీక్షలు చేయించుకొని ఇంటికి వెళ్ళిపోదామని ఆటో కు వస్తే ఇక్కడ వైద్యులు లేకపోవడంతో నిరీక్షించాల్సి వచ్చింది. ఈ ఆసుపత్రికి ఎప్పుడు వచ్చినా ఇలాగే జరుగుతోంది.

- గ్రేస్ సలోమి, వృద్ధురాలు, ఆకివీడు

• పట్టించుకొనే వారేరి



పది కిలోమీటర్ల దూరం నుంచి రెండు ఆటోలు పట్టుకొని ఆసుపత్రికి వస్తే ఇక్కడ వైద్యులు లేరు. వైద్యులు వచ్చిన తర్వాత చూపించుకుని ఎండను పడి వెళ్లాల్సి వస్తోంది.

- వానపల్లి సత్యనారాయణ, వృద్ధుడు, కోళ్ళపర్రు

• అమరావతికి ఫిర్యాదు చేస్తా



కాళ్ళ మండలం ఏలూరుపాడు నుంచి మూడు ఆటోలు పట్టుకొని ఆసుపత్రికి వస్తే ఒక్క డాక్టరు లేరు. గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. డీసీహెచ్‌ఎస్‌కు ఫోన్ చేసి చెప్పాను. పరిస్థితి మారకపోతే వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా.

- జి.రాజు, వృద్ధుడు, ఏలూరుపాడు



ఆకివీడు సీహెచ్‌సీలో వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు

▪ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

10,927 మందికి ఓటర్ కార్డులు

నరసాపురం ఆర్డీవో, ఆర్‌వో అంబరీష్



- నరసాపురం నియోజకవర్గంలో ఐదు రోజుల క్రితం 10,927 మందికి ఓటర్ కార్డులు పోస్టు చేశాం. వీరిలో కొత్త ఓటర్లతోపాటు ఇటీవల సవరణలు, చేర్పులు, మార్పులు చేసుకున్న వారు ఉన్నారు. ఇంకా ఎవరికైనా కార్డులు లేకపోతే వారు తహసీల్దార్లు, లేదా ఎన్నికల డీటీని సంప్రదించవచ్చు.
- కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం జారీ చేసిన గడువు ఈ ఏడాది ఏప్రిల్ 15 వరకు ఉంది. లిస్టుల్లో ఓటు ఉండి, కార్డు లేకపోతే ఆధార్ కార్డు లేదా ఎన్నికల సంఘం సూచించిన ఏ గుర్తింపు కార్డునైనా చూపించి ఓటు వేయవచ్చు.
- 85 ఏళ్లు నిండి, అంగవైకల్యం, పక్షవాతం, తదితర అనారోగ్య కారణాల వల్ల మంచం పట్టిన వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేయవచ్చు. వారు తమ పరిధిలోని బీఎల్‌వోలను సంప్రదించాలి.
- ఓటర్లు ప్రలోభాలకు గురికాకూడదు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలి. ఎక్కడైనా సమస్యలుంటే ఎలక్షన్ సెల్ 08814-276699, ఆర్వో, ఏఆర్వోలతోపాటు ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా ఫిర్యాదు చేయండి.
- అభ్యర్థులు తమ ప్రచారాలకు, సభలకు అనుమతి తప్పనిసరి.
- సబ్ డివిజన్ పరిధిలో చించినాడ, సిద్ధాంతంలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం.
- నియోజకవర్గంలో 22 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి.
- మొత్తం 1,68,122 మంది ఓటర్లకు గాను 169 పోలింగ్ బూతులను ఏర్పాటు చేశాం.

- నరసాపురం

పచ్చని చేలు.. బీడువారె..!



భీమవరం మండలంలో సాగు లేక బీడుగా మారిన పంట భూమి

ప్రభుత్వం చిన్నచూపు.. రైతు కంట కన్నీరు

సిరులు పండే పంట భూములు బీళ్లుగా మారుతున్నాయి. గడిచిన రెండేళ్ళలో జిల్లాలో 25 వేల ఎకరాలకు పైగా పంట లేని భూములుగా తయారైంది. ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు సాగుకు దూరమవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం జిల్లాలో 2 లక్షల 50 వేల ఎకరాలకు పైగా దాళ్వా సాగు జరిగింది. అదే ఈసారి 2 లక్షల 25 వేల ఎకరాలకే పరిమితమైంది. అంటే వేల మెట్రిక్ టన్నుల దిగుబడికి గండిపడింది.

- భీమవరం రూరల్

- 25 వేల ఎకరాలకుపైగా సాగు లేక బీడుగా..
- 50 బస్తాలు పండే చేలు పనికి రాకపోయే
- కాలువల అభివృద్ధి లేదు.. మురుగు ముంపు, సాగు నీటి ఎద్దడితో అన్నదాతల అవస్థలు
- సాగును గాలికి వదిలేసిన వైసీపీ సర్కార్

• కాలువలు అభివృద్ధి చేస్తే ఒట్టు

వైసీపీ ప్రభుత్వం వచ్చాక రైతులకు సాగులో మురుగు నీరు వరి చేలను ముంచేస్తోంది. సాగు నీరు సరిగా రాక వరి చేలు బీటలు తీస్తున్నాయి. అదే రైతులకు సాగులో నష్టాల పాలవుతున్నారు. ఏటా వేసవిలో పంట కాల్వలు, మురుగు కాల్వలు అభివృద్ధి చేసి సార్వా, దాళ్వా పంటలకు ముంపు, సాగునీటి ఎద్దడిలు రాకుండా ప్రభుత్వం చేయాలి. దీని కోసం ఏడాదికి కాలువల అభివృద్ధికి జిల్లాకు సుమారు రూ.10 కోట్ల వరకు పనులు జరగాలి. గడిచిన మూడేళ్ళలో 20 శాతం పనులైనా జరగలేదు. పూడిపోయిన కాల్వలను చూస్తే అర్థమవుతుంది. అందువల్లే సాగులో నష్టాలు చూసి రైతులు పంట భూములలో సాగు చేయడం లేదు. గడిచిన సార్వాలో 50 వేల హెక్టార్లలోని పంట తుఫాన్ దెబ్బకు మునిగి దెబ్బతింది. దీనికి ప్రధాన కారణం మురుగు కాల్వలు సరిలేకేనని రైతులు చెబుతున్నారు.

• రూ.150 కోట్లు సబ్సిడీ దూరం

సాగులో కీలకమైన యాంత్రిక పనిముట్లను ప్రభుత్వాలు సబ్సిడీపై రైతులకు అందజేసేవి. కాని, వైసీపీ ప్రభుత్వ హయాంలో గడిచిన ఐదేళ్లలో జిల్లా రైతులకు సుమారు రూ.150 కోట్ల వరకు సబ్సిడీ పనిముట్లు అందలేదు. దీంతో కౌలు రైతులు పూర్తి ధరతో యాంత్రిక పనిముట్లు కొనుగోలు చేసి, సాగు చేయలేక స్తోమత సరిపోక సాగుకు దూరమయ్యారు. గత ప్రభుత్వంలోని చివరి ఏడాది ఉమ్మడి జిల్లాకు రూ.25 కోట్లకుపైగా విలువైన పనిముట్లను సబ్సిడీపై అందజేశారు.

• సాగునీటి సంఘాలు లేక

వరి రైతుల సాగు, మురుగు నీటి సమస్యల పరిష్కారానికి గతంలో నీటి సంఘాలు విశేష కృషి చేసేవి. నాయకులు, వ్యవసాయ అధికారులు, రైతులకు మధ్య వారధులుగా పనిచేసేవారు. అలాంటి నీటి సంఘాలను ప్రభుత్వం లేకుండా చేయడం రైతుల సమస్యలు పెరిగి సాగు నష్టాలను పెంచాయి. చివరికి కొన్ని గ్రామాలలో పదుల సంఖ్య కొన్ని గ్రామాలలో బీడు భూములుగా సాగు లేకుండా పోయి జిల్లాలో వేల ఎకరాలుగా మారింది.

> డెల్టాలోని ఓ గ్రామంలో పోటీపడి మరి పంటలు పండించే వారు. ఎకరానికి 55 బస్తాలకు దిగుబడి వచ్చేది. రైతులు ఆనందంతో సంబరాలు చేసుకునే వారు. ఇది రెండేళ్ల క్రితం మాట. కాని ఇప్పుడు అది పంట లేని బీడు భూమి ప్రాంతమయ్యింది. అక్కడ రైతు కుటుంబాల్లోని మగ పిల్లలకు పెళ్లిళ్లు కావడం భారంగా మారింది. భూముల విలువ పడిపోయిం ది. దీనికి కారణం వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి వ్యవస్థ సరిగా లేకపోవడం, గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమవడం, సస్య రక్షణ, ప్రకృతి విపత్తులపై మందస్తు హెచ్చరికలు లేకపోవడం.. ఇవన్నీ కారణాలుగానే కనిపిస్తున్నాయి.

• కౌలు రైతులకు నష్టం

ఎకరానికి పది వేలు మిగులుతుందని సాగు చేస్తే ఒక్క రూపాయి కూడా మిగలకపోవడంతో కౌలుకు రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు. మద్దతు ధర కల్పిస్తున్నామని ప్రచారం చేస్తూ ప్రతీ పంటలోని బస్తాకు ధాన్యం కోత, ధరలో కోత విధిస్తూ మిల్లర్లు, మధ్యవర్తులు స్వాహా చేస్తున్నారు. దీనిని అధికారులు పట్టించుకోకపోవడంతో ఎకరానికి ధాన్యం సొమ్ములో రూ.15 వేలు కోత పడడంతో కౌలు రైతుకు మిగులు పోయి సాగు వదిలేలా చేసింది.

నేడు, రేపు భువనేశ్వరి పర్యటన



ఏలూరు/తాడేపల్లిగూడెం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను తట్టుకోలేక మరణించిన పార్టీ కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను పరామర్శించేందుకు ఆయన సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరిట ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మంగళ, బుధవారాల్లో పర్యటిస్తారు. తొలిరోజు ఎర్రంపేట, కన్నాయగూడెం, బయ్యన్నగూడెం, పేరంపేట, చింతలపూడి ప్రాంతాల్లో పర్యటిస్తారు. రెండో రోజు బుధవారం తాడేపల్లిగూడెం, ఉంగుటూరు నియోజకవర్గాల పరిధిలోని కుంచనపల్లి, పడమరవిప్పర్రు తదితర గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. అనంతరం విజయవాడ పయనమవుతారు. ఈ మేరకు తాడేపల్లిగూడెంలో టీడీపీ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జి ఏర్పాట్లు చేశారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి : కలెక్టర్



భీమవరం, మార్చి 25 : 'ఎన్నికల ప్రవర్తన నియమావళిపై రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి. విభేదాలు పెంచేలా, పరస్పర ద్వేషాలను రగిలించేలా, విభిన్న కులాలు, వర్గాలు, మతాలు, భాషల మధ్య ఉద్రిక్తతకు దారి తీసే కార్యకలాపాలకు పాల్పడకూడదు. ఓట్ల కోసం కుల, మత, వర్గ భావాలతో అభ్యర్థించకూడదు. దేవాలయాలు, మసీదులు, చర్చ్‌లు మొదలైన ఆరాధన ప్రదేశాలను ఎన్నికల ప్రచారానికి వేదికగా ఉపయోగించకూడదు. అభ్యర్థుల వ్యక్తిగత జీవితానికి సంబంధించి అతని ప్రజా జీవితంతో సంబంధం లేని ఏ అంశంపైన విమర్శ చేయకూడదు' అని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.



వైసీపీ రంగుల మాటేంటి ? -5లో




తాడేపల్లిగూడెం 23వ వార్డు చిన ముత్యాలమ్మ ఆలయం వద్ద శిలా ఫలకానికి , రేవుకు వేసిన రంగులు

వైసీపీ రంగుల మాటేంటి ?

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 25 : తాడేపల్లిగూడెం 23వ వార్డులోని చిన ముత్యాలమ్మ ఆలయానికి మున్సిపాలిటీ నిధులు రూ.4 లక్షలతో ఆధునీకరణ పనులు చేపట్టి చుట్టూ వైసీపీ రంగులు వేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనుల నిమిత్తం వేసిన శిలా ఫలకంలో పేర్లు కనిపించకుండా పేపరు అతికించిన అధికారులు శిలా ఫలకానికి, రేవుకు ఇరు వైపులా వేసిన వైసీపీ రంగులు మాత్రం తొలగించలేదు.

సీఎం ఫొటో లేని ధ్రువీకరణ పత్రాలు జారీ

జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారావు

ఏలూరుసిటీ, మార్చి 25:జిల్లాలో ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ఫొటో లేని ధృవీకరణ పత్రాలు జారీ చేస్తున్నామని జిల్లా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ధృవీకరణ పత్రాల జారీ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లాకు 88 వేల ఫారాలను మంజూరు చేసిందని , జిల్లాకు ఇప్పటికే 44 వేల హై సెక్యూరిటీ ధృవపత్రాల ఫారాలు అందాయని, వాటిని జిల్లాలోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాలకు పంపామన్నారు. మరో 40 వేల ఫారాలు రెండు రోజుల్లో జిల్లాకు అందుతాయన్నారు. విద్యార్థులకు, రైతులకు, వివిధ వర్గాలకు అవసరమైన ధృవీకరణ పత్రాలను సీఎం ఫొటో లేకుండా అందిస్తున్నామన్నారు.

నిట్ విద్యార్థులకు బహుమతులు



బహుమతి అందుకుంటున్న విద్యార్థి పార్థసారథి

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 25 : విద్యార్థులు చదువుతో పాటూ ఆవిష్కరణలో కూడా ప్రతిభ కనపర్చడం అభినందనీయమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌కు చెందిన నల్గురు విద్యార్థులు వేర్వేరు విభాగాలలో రెండు బహుమతులను సాధించడంతో ఏపీ నిట్ ఇంచార్జి డైరక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి, దినేష్‌శంకర్‌రెడ్డి అభినందించారు. దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ మెటలార్జికల్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి రాఘవరపు పార్థసారధి ఇటీవల పూణేలో నిర్వహించిన 50వ జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌పై పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చాడని దీనికి ఉత్తమ పేపర్ అవార్డుతో పాటూ రూ.5 వేలు నగదు అందజేశారన్నారు. ఈఈఈ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వి.జయంత్, పీ.భాను, కే.దీక్షిత ఇటీవల శశి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాజక్టు ఎక్స్‌పో కార్యక్రమంలో ప్రదర్శించిన ఎలక్ట్రికల్ వాహనాలలో తక్కువ ధర బ్యాటరీ, నిర్వహణ వ్యవస్థ, ఆరోగ్యస్థితి అంచనా ఆవిష్కరణకు తృతీయ స్థానాన్ని, రూ.5 వేలు నగదు అందుకున్నారన్నారు. ఈఈఈ విభాగాధిపతులు డాక్టర్ రఫీ మహ్మద్, డాక్టర్ టీ.రమేష్, ఆచార్యులు వీ.సందీప్, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.



క్లాప్ కొడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు

ఏలూరులో కొత్త సినిమా షూటింగ్ సందడి

ఏలూరు కల్చరల్, మార్చి 25: ఆర్వీ స్టూడియోస్ బ్యానర్‌పై నూతన నటీనటులతో నిర్మించనున్న ప్రొడక్షన్ నెంబర్‌వన్ చిత్రం ముహుర్తపు షాట్‌ను ఏలూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో తీశారు. నలుగురు స్నేహితుల మధ్య జరిగే సంఘటనా దృశ్యాలను చిత్రీకరించారు. డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విజయ్‌రాజు మాట్లాడుతూ మంచి టీమ్‌లో కుటుంబ నేపథ్యంలో మంచి సందేశాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్న ఆర్వీ స్టూడియోస్ అధినేత రవికుమార్‌ను అభినందించారు.సినీ నిర్మాత, దర్శకుడు, రచయిత దాసరి రవి కుమార్ మాట్లాడుతూ నూతన నటీనటులతో సినిమా తీస్తున్నట్లు చెప్పారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి రాయుడు రవికుమార్, తెలుగు చలనచిత్ర ప్రముఖులు వి.జయకుమార్, ప్రొడక్షన్ మేనేజరు శివ, డి.గణేష్, రాంబాబు, నాగశ్రీ, హరి, భాను, సాత్విక్, రాఘవ పాల్గొన్నారు.

పోలవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఎస్.రామ్మోహన్

బుట్టాయగూడెం, మార్చి 25 : పోలవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఎస్.రామ్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేశారని అదనంగా మన్యం జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ కేంద్రాలను అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలపడం వలన ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్లాలంటే 200 కిలోమీటర్లు దూరం కావడం వలన ఆదివాసీలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదన్నారు. రంపచోడవరం రెవిన్యూ డివిజన్‌లో ఉన్న మండలాలు, చింతూరు, కుక్కునూరు డివిజన్లలో కలిపి ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలు వారి మేనిఫెస్టోలో పోలవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేస్తామని నిర్ధష్టమైన హామీ ఇవ్వాలని, హామీ ఇచ్చినవారికే ఓటు వేస్తామన్నారు. అనాది నుంచి ఆదివాసీలు అన్యాయానికి, నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నారన్నారు. 1917, 1956, 1970 చట్టాలు ఉన్నా రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయని విమర్శించారు. హక్కులు, చట్టాలు, షెడ్యూల్ ప్రాంతం పరిరక్షణ కోసం గిరిజనులు పోరాడాలని తెలిపారు. ప్రత్యేక జిల్లా కోసం ముక్తకంఠంతో నినదించాలన్నారు.



బీజేపీ నాయకుడు రావూరి సుధ కారు ధ్వంసం

ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదు..

పాలకొల్లు టౌన్, మార్చి, 25 : ఇంట్లో పార్కింగ్ చేసిన తన కారును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని పాలకొల్లుకు చెందిన బీజేపీ నాయకుడు, కాకినాడ పార్లమెంట్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ రావూరి సుధ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసి రెండు రోజులు గడుస్తున్నా ఎటువంటి స్పందన లేదన్నారు. సోమ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22 రాత్రి 11 గంటల సమయంలో కారు పార్కింగ్ చేశామన్నారు. మరుసటిరోజు ఉదయం చూసేసరికి కారు వెనుక భాగం అద్దం పూర్తిగా ధ్వంసం అయి ఉందన్నారు. పార్కింగ్ స్థలంలో వరుసగా కార్లు ఉన్నాయనీ పసగట్టుకుని తన కారును టార్గెట్ చేసి ధ్వంసం చేశా రన్నారు. ఇది రాజకీయ కక్షతో చేసిన పనే అని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం కాకినాడ పార్లమెంట్ బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టానని తరుచూ కాకినాడ వెళ్లి వస్తున్నానన్నారు. తనకు తన కుటుంబానికి రక్షణ కావాలని కోరారు.

25-03-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	241	235	239.32
జంగారెడ్డిగూడెం-1	240	235	239.80
జంగారెడ్డిగూడెం-2	240	235	239.54
కొయ్యలగూడెం	241	235	239.77
గోపాలపురం	240	235	238.76

అమ్మో..రోడ్లా ఇవి..!

గజానికో గొయ్యి..అడుగుకో గుంత.. ఎటు వెళ్లినా గోతుల దారుల్లో అవస్థలు మాత్రం తప్పవు. జిల్లాలో ఉన్న ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గోతుల రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నామని వాహనదారులు లబోదిబోమంటున్నారు. ఈ ఐదేళ్లలో రోడ్ల ముఖం చూడని ప్రభుత్వం ఎన్నికలు దగ్గర పడుతుడండడంతో ఇటీవల కొన్ని ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి హడావుడిగా శంకు స్థాపనలు చేశారు.. రోడ్డు పనులు మాత్రం జరగలేదు...



అధ్వానంగా యలమంచిలి - చించినాడ రహదారి



గోతులమయంగా ప్రత్తిపాడు- అలంపురం రహదారి

శంకుస్థాపనలు కాదు..రోడ్లు వేయండి

పెంటపాడు, మార్చి 25 : మండలంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అప్పుడప్పుడు మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడం తప్ప ఈ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రోడ్లు వేసిన పరిస్థితులు లేవు. మండలంలో అలంపురం నుంచి ప్రత్తిపాడు వెళ్ళే రహదారి, ప్రత్తిపాడు ఫుడ్‌ప్యాట్స్ నుంచి రాచర్ల వెళ్ళే రహదారి, చింతపల్లి, కోరుమిల్లి, నుంచి బీ.కొండేపాడు వెళ్ళే రహదారి, దువ్వ వెంకయ్య ఒయ్యేరు నుంచి బీ.కొండేపాడు మీదుగా మీనవల్లూరు వెళ్లే రహదారి, కాశిపాడు నుంచి రావిపాడు వెళ్లే రహదారులు అధ్వానంగా మారడంతో ఆ దారిలో ప్రయాణం చేసేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆకుతీగపాడు నుంచి ముక్కేపురం మీదుగా కే.పెంటపాడు వెళ్లే రహదారిని అధికారం చేపట్టిన నాటినుంచి పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికలు వస్తుండటంతో ఇటీవల కొన్ని రోజుల క్రితం హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. వల్లూరు పల్లి నుంచి రాచర్ల వెళ్ళే రహదారి పరిస్థితి కూడా ఇంతే.. దీనికి కూడా ఇటీవలే శంకుస్థాపనలు చేశారు. తమకు శంకుస్థాపనలు చేయడం కాదని రహదారులను మెరుగు పరిచి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సైకిళ్లు పంక్చర్లు పడుతున్నాయి..



పాలకొల్లు రూరల్ : మండలంలోని వరధనం గ్రామం నుంచి పెదమామిడిపల్లి మీదుగా చించినాడ బైపాస్ రోడ్డుకు వెళ్లే రహదారి పూర్తిగా కంకర లేచిపోయి అధ్వాన్నంగా తయారైంది. ఈ రోడ్డు వెంబడి నిత్యం వంద లాది మంది బైక్‌లు, సైకిళ్లపై ప్రయాణిస్తుంటారు. ఈరోడ్డు మీదుగా పెద మామిడిపల్లి నుంచి పాలకొల్లు పట్టణానికి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు సైకిళ్లపై వచ్చి వెళుతుంటారు. గోతుల రోడ్లపై సైకిల్ టైర్లు పంక్చర్లు కావడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



యలమంచిలి : మండలంలోని మేడపాడు, నేరేడుమిల్లి, రావిపాడు గ్రామాల మధ్య ప్రధాన రహదారి గోతులు ఏర్పడి, చాలాచోట్ల కంకరరాళ్లు పైకిలేచి ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సుమారు ఆరు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న

నరకానికి మార్గాలు

ఈ రహదారి గోతుల మయంగా ఉండటంతో రాకపోకలు సాగించేవారు ఇక్కట్లు పడుతున్నారు. యలమంచిలి, పోడూరు, ఆచంట మండలాలకు అనుసంధానంగా ఉన్న ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారిలో కంకరరాళ్లు పైకి తేలడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతు న్నామని వాహనదారులు వాపోతున్నారు. ఐదేళ్లుగా ఈ రహదారిని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సుమారు వారం రోజుల క్రితం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం గమనార్హం. మేడపాడు, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక, నవరసపురం గ్రామాల మధ్య రహదారి అధ్వా న్నంగా మారింది. ఈ మార్గంలో పెద్దఎత్తున గోతులు ఏర్పడటం, పలుచోట్ల రహదారి కుంగిపోవడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడు తున్నారు. సుమారు రెండున్నరేళ్ల క్రితం రూ.4 కోట్లతో ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించారు. చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు.



ప్రయాణం.. నరకప్రాయం

లింగపాలెం: లింగపాలెం మండలంలోని రోడ్లు దారుణంగా తయారయ్యాయి. రాళ్లు లేచి కంకర బయటపడటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్ళే ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా తయారడంతో ప్రయాణం నరకప్రాయంగా ఉందంటూ గ్రామస్థులు వాపోతున్నారు. రోడ్లు పాడైపోవడంతో కొద్దిపాటి వర్షాలు కురిసినా రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.

అధ్వానం భీమవరం-గుడివాడ రోడ్డు

కాళ్ళ : కాళ్ల మండలంలోని ప్రధాన రహదారి భీమవరం-గుడివాడ రాష్ట్రీయ రహదారి అధ్వానంగా తయారైంది. మండల పరిధిలో సుమారు 20 కిలోమీటర్లు పొడవునా ఉండే ఈ రహదారి అడగడుగునా గోతులమయంగా ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోపల్లె, జక్కరం, కాళ్ళ, దొడ్డనపూడి, ఏలూరుపాడు తదితర గ్రామాల వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి.

భీమవరం - గుడివాడ రహదారి దుస్థితి



ఈ ఐదేళ్లలో ఒక్క రోడ్డూ వేయలేదు

జంగారెడ్డిగూడెం, మార్చి 25 : గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అత్యంత దారుణంగా తయారయ్యాయని చింతలపూడి నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని చక్రదేవరపల్లి గ్రామ రహదారిని చూసి ఆయన స్పందించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలైనా ప్రయాణికుల సౌకర్యార్థం ఒక్క రోడ్డు కూడా నిర్మించలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చింతలపూడి నియోజకవర్గంలో ఉన్న రహదారులన్నీ నిర్మిస్తామన్నారు.



చక్రదేవరపల్లి రోడ్డులో గుంతలను చూపుతున్న రోషన్‌కుమార్

సోమేశ్వరస్వామికి పంచదారతో అభిషేకం



భీమవరంటౌన్, మార్చి 25 : పౌర్ణమి పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామివారిని పంచదారతో అలంకారం చేశారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పంచదారతో అభి షేకం చేసి అలంకారం చేశారు.ఈవో రామకృష్ణంరాజు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

ఘనంగా డోలా పౌర్ణమి మహోత్సవం



ద్వారకాతిరుమల, మార్చి 25 :డోలా పౌర్ణమి పురస్కరించుకుని తొళక్క వాహనంపై ఉభయ దేవేరులతో కొలువు దీరిన శ్రీవారు సోమవారం ఉదయం సాయంత్రం తిరువీధుల్లో ఊరేగారు. తొలుత స్వామి అమ్మ వార్లను తొళక్క వాహనంపై ఉంచిన వాహ నాన్ని అలంకరించారు. అనంతరం అర్చకులు స్వామివారికి హారతులు అంద జేశారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారి వాహనం తిరువీధుల్లో ఊరేగింది.

జీఎస్ఎల్‌లో జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీలు



రాజమహేంద్రవరం, మార్చి 25: కత్తి యుద్ధం ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన యోధురాలు (ఫెన్సర్) మొదటి భారతీయ వనిత సీఏ భవానీదేవిని స్ఫూర్తిగా తీసుకుని ఫెన్సింగ్ (కత్తి యుద్ధం)క్రీడలో నైపుణ్యాలు సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు పిలుపు నిచ్చారు. యువజన, సాంస్కృతికశాఖ, ఎఫ్ఏఏపీ (ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో 25వ జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు రాజానగరం జీఎస్ఎల్ ప్రాంగణంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నన్నయ వీసీ పద్మరాజు, జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరావు పోటీలను ప్రారంభించారు. సీనియర్ నేషనల్ ఫెన్సర్, ఎఫ్ఏఏపీ రాష్ట్ర కార్యదర్శి జీఎస్వీ కృష్ణ భగవాన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 10 నుంచి 14 ఏళ్ల వయసున్న 250 మంది బాలికలు, 271 మంది బాలురు, 160 మంది కోచ్‌లు, మేనేజర్లు, టెక్నీషియన్లు హాజరైనట్టు చెప్పారు. మాజీ సెక్రటరీ, అసోసియేషన్ మెంటార్ ఎన్.సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఇద్దరి మధ్య 3 నిమిషాలు వంతున నిమిషం వ్యవధితో వెంట వెంటనే మూడుసార్లు పోటీ ఉంటుంద న్నారు. 15 పాయింట్లు సాధించిన వారు విజేతలని, పోటీల్లో నైపుణ్యాలను కచ్చితంగా గుర్తించడానికి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగిస్తున్నామని విజేతలకు బంగారు, వెండి, కాంస్య పతకాలు బహుమతులుగా అందజేయనున్నట్టు చెప్పారు.

క్రైం కార్నర్



బోల్తా కొట్టిన ప్రమాదానికి కారణమైన కారు



సత్యనారాయణ(ఫైల్)

కారు ఢీకొని హోటల్ యజమాని మృతి

కూతురు, సోదరికి తీవ్రగాయాలు

పెదవేగి, మార్చి 25 : మద్యం సేవించి వాహనాలు నడుపరాదంటూ పోలీసులు ఎంతగా హెచ్చరిస్తున్నా వారి మాటలు పెడచెవిని పెడుతూనే ఉన్నారు. ప్రమాదాలకు కారణమవుతూనే ఉన్నారు. పెదవేగి మండలం చక్రాయగూడెంలో ఆదివారం రాత్రి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెదవేగి ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం వేగివాడకు చెందిన మారగాని సత్యనారాయణ వేగివాడ సెంటర్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు.ఆదివారం రాత్రి పదకొండు గంటల సమయంలో కొంతమంది టిఫిన్ చేశారు. బిల్లు రూ.150 కాగా ఫోన్ పేలో రూ.15 చెల్లించి వెళ్లిపోయారు. దీంతో సోదరి మణి, కుమార్తె పురందరేశ్వరితో సత్యనారాయణ బైక్‌పై వారిని కొంతదూరం వెంబడించి తిరిగి వేగివాడ వస్తున్నారు. అదే సమయంలో ఏలూరు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టి వందమీటర్లకు పైగా ఈడ్చుకెళ్ళింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ (48) అక్కడికక్కడే మృతి చెందగా, అతని సోదరి మణి, కుమార్తె పురందరేశ్వరి తీవ్ర గాయాలపాలయ్యారు. కొంత మంది గ్రామస్థులు ఆ కారును వెంబడించగా దెందులూరు మండలం చల్లచింతలపూడి దగ్గరలో పోలవరం కాలువలో బోల్తా పడింది. గ్రామస్థులు కారును నడుపుతున్న తడికలపూడికి చెందిన శిరుగుబత్తుల నవీన్ అనే యువకుడితో పాటు కారులో ఉన్న మరో ఇద్దరు యువకులను పట్టుకుని పెదవేగి పోలీసులకు అప్పగించారు. కారు కాంగ్రెస్ పార్టీకి చెందిన కావూరి లావణ్యకు చెందినదిగా చెప్తున్నారు. కారులో ఉన్న ముగ్గురు యువకులు మద్యం మత్తులో ఉన్నట్లుగా గ్రామస్థులు తెలిపారు. మృతుడు సత్యనారాయణకు తొమ్మిదో తరగతి చదువుతున్న కుమార్తె పురందరేశ్వరితో పాటు దివ్యాంగుడైన పదో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. చిన్నతనం నుంచి కష్టపడి కుటుంబాన్ని పోషించిన అతని కుటుంబం ఈరోజున దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

మృతదేహంతో రాస్తారోకో



ప్రమాదానికి కారణమైన కారుకు సంబంధించిన వారు సోమవారం సాయంత్రం వరకు కూడా స్పందించకపోవడంపై ఆగ్రహించిన గ్రామస్థులు సోమవారం సాయంత్రం నాలుగుగంటల నుంచి మృతదేహంతో ఏలూరు- జంగారెడ్డిగూడెం రహదారిపై రాస్తారోకో చేశారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరిగినా కావూరి లావణ్య రాక పోవడం ఏమిటని, ఆమె వచ్చేంతవరకు రాస్తారోకో ఆపేది లేదని భీష్మించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్ మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

చెర్వులో పడి యువకుడి మృతి




ఉంగుటూరు, మార్చి 25 : ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామ పరిధిలోని కోటవాని చెర్వులో ఒక యువకుడు మృతి చెందినట్టు చేబ్రోలు పోలీసులు తెలిపారు. నిడమర్రు మండలం చిన నింద్రకొలను వాసి రావూరి సాయికుమార్ ప్రేమ వివాహం చేసుకుని ఉంగుటూరు మండలం సీతారాంపురంలో వడ్రంగి పని చేసుకుని జీవిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిస కావడంతో మానసికంగా ఇబ్బంది పడుతూ చెర్వులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు చేబ్రోలు ఎస్ఐ మణికుమార్ తెలిపారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాలుడు అరెస్టు..7.50 లక్షలు స్వాధీనం

ఆకివీడు, మార్చి 25: అనాధ అని చేరదీస్తే వారి ఇంట్లోనే చోరీ చేసిన బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే సోమవారం ఆకివీడు రైల్వేస్టేషన్ దగ్గర అదుపులోకి తీసుకొని రూ.7.50 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మందపాడుకు చెందిన రొయ్యల వ్యాపారి ముద్దే వెంకట దుర్గా ప్రసాద్, దూదిగామ రాంబాబులకు వారం రోజులు క్రితం పదహారేళ్ళ బాలుడు ఊరులో కనబడ్డాడు. అనాధనని చెప్పడంతో చేరతీసి భోజనం పెడుతున్నారు. అయితే ఆదివారం దుర్గాప్రసాద్, భార్య బయటకు వెళ్ళడంతో ఆ బాలుడు ఇంటి తాళాలు పగలకొట్టి నగదు కాజేసిన సంగతి తెలిసిందే. బాలుడిని అరెస్టు చేసి ఏలూరులోని జువెనైల్ హోమ్‌కి తరలించామని సీఐ సత్యనారాయణ, ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత మృతి



మృతి చెందిన ఉషారాణి

పెదపాడు, మార్చి 25 : పెదపాడు మండలం వసంతవాడ గ్రామానికి చెందిన వివాహిత చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందిన ఘటనపై పెదపాడు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వసంతవాడ గ్రామానికి చెందిన పోలగాని నాగరాజుతో ఉషారాణి (27)కి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగు సంవత్సరాల పాప ప్రియాంక, మూడు సంవత్సరాల బాబు లోకేష్ ఉన్నారు. తాపీపనులు చేసే నాగరాజు తరచూ తాగివచ్చి ఉషారాణితో తగాదా పడేవాడు. 24వ రాత్రి మరలా గొడవ జరిగినట్లు పోలీ సులు తెలిపారు. 25వ తేదీన ఉదయం ఇంటి ఎదురుగా వున్న మామిడిచెట్టు కొమ్మకు ఉరి వేసుకుని కన్పించడంతో కుటుంబసభ్యులు పెదపాడు పోలీ సులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్సై కె.స్వామి (దెందులూరు) అను మానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయాలు.. ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 25 : ఏలూరు నగరం, రూరల్ ప్రాంతాల్లో మద్యం కల్గి ఉన్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వంగాయిగూడెం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో సాయినగర్‌కు చెందిన జోగి జయరాజు ఏడు బీరు బాటిల్స్‌ను కల్గి ఉన్నాడు. దీంతో అతనిని సోమవారం సాయంత్రం రూరల్ ఎస్ఐ రాజారెడ్డి అరెస్టు చేశారు. ఏలూరు పత్తేబాద మంచినీటి తోటకు చెందిన కాలెపు ఉమా మహేశ్వరరావు నాలుగు మద్యం బాటిల్స్‌ను కల్గి ఉండి ఏలూరు సమీపంలోని సత్రంపాడు సెంటర్ వద్ద విక్రయిస్తున్నాడు. దీంతో ఏలూరు త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. పెదపాడు మండలం సీతారామపురానికి చెందిన పసుపులేటి నాగరాజు ఏలూరు సత్రంపాడు సెంటర్ వద్ద నాలుగు మద్యం బాటిల్స్‌ను విక్రయిస్తుండగా త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అరెస్టు చేశారు.

మహిళపై దాడి.. ఒకనిపై కేసు నమోదు



గాయాలకు గురైన అచ్యుత కుమారి

ఏలూరు క్రైం, మార్చి 25 :వేంకటేశ్వరస్వామి దేవా లయంలో జరిగే కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లలో పాత కార్యవర్గానికి, కొత్త కార్యవర్గానికి మనస్పర్థలు ఏర్పడి మహిళా కార్యదర్శిపై ఒక వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు కండ్రిక గూడెం లోని రాజరాజేశ్వరి నగర్‌లో ఉన్న వేంకటేశ్వర ఆలయ కమిటీ కార్యదర్శిగా సావన్ అచ్యుత కుమారి వ్యవహ రిస్తున్నారు. ఆదివారం రాత్రి కల్యాణ ఏర్పా ట్లను ఆమె పర్యవేక్షిస్తున్నారు. కమిటీకి చెందిన రెడ్డినాగ రాజు ఆమెతో గొడవ పెట్టుకుని ఒక్కసారిగా రాడ్డుతో తలపై కొట్టాడు. తీవ్రగాయాలపాలైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.ఆమె అపస్మారక స్థితిలో ఉండడంతో ఆమె కుమారుడు చందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు రెడ్డి నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి.. పదిమంది అరెస్ట్

మండవల్లి, మార్చి 25: మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం డొంకలో పేకాడుతున్న 10 మంది జూదరులను మండవల్లి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,900లు నగదు, 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మండవల్లి ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడులు నిర్వహించారు.

గడ్డివాము, పశువులపాక దగ్ధం

కైకలూరు, మార్చి 25: పశువులపాక, గడ్డివాము దగ్ధమై రూ.10 వేల ఆస్తినష్టం జరిగింది. సోమవారం రాత్రి కైకలూరులోని పెద్దమసీదు వెనుక తిరుమాల సత్యనారాయణకు చెందిన పశువుల పాక, గడ్డివాముకు ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా అగ్నిమాపక శాఖాధికారి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేసి పాకలో ఉన్న ఒక ఆవు, రెండు గేదెలను రక్షించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

వేంకటేశ్వరస్వామికి గరుడోత్సవం



భీమవరం టౌన్, మార్చి 25 : పౌర్ణమి సందర్భంగా జువ్వలపాలెంరోడ్డులోని పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు గరుడోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేసిన అనతరం గరుడ వాహనంపై ఉంచి మంగళ వాయిద్యాలతో సేవను నిర్వహించారు. ఉదయం పాల్గుణ మాసం ఉత్తర నక్షత్రం(లక్ష్మీ జయంతి)ని పురస్కరించుకుని అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి అలంకారం చేశారు.

చదరంగంతో మేథాశక్తి పెరుగుదల



శిక్షణ ఇస్తున్న గ్రాండ్ మాస్టర్ గిరినాథ్

భీమవరం అర్బన్, మార్చి 25: చదరంగ శిక్షణ తీసుకోవడం ద్వారా మేథాశక్తి పెంపొందించుకుని ఉన్నత విద్యలో రాణించడాని తోడ్పడుతుందని ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్ అన్నారు. అనసూయ చెస్ అకాడమీ, జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విశ్వకవి స్కూల్‌లో ఉచిత చదరంగ శిక్షణ శిబిరం నిర్వహించారు. విశ్వకవి స్కూల్ కరస్పాండెంట్ పొట్లూరి రఘుబాబు, జిల్లా చదరంగ అసోసియేయోషన్ జిల్లా అధ్యక్షులు మాదాసు కిషోర్, అల్లు శ్రీనివాస్, తోట హరిబాబు పాల్గొన్నారు.

పంట పొలాలకు నీరు అందించాలి

భీమవరం అర్బన్, మార్చి 25: జిల్లాలో శివారు భూములకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి కార్యదర్శి లంక కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం రైతు సంఘ కార్యాలయంలో రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి సమావేశం నిర్వహించారు. పంట పొలాలకు నీరు అందకపోవడంతో రైతులు ఇంజన్లపై ఆధారపడటం వల్ల ఎకరాకు రూ.5వేల ఖర్చుఅవుతుందన్నారు. నీరు అందక పోవడానికి ముఖ్యకారణం కాలువలలో తూడు, గురపు డెక్క పెరిగిపోవడం అన్నారు. వెంటనే తూడును తొలగించే చర్యల చేపటాలని సూచించారు. రైతులకి ప్రభుత్వం ఇవ్వాల్సిన సార్వా బకాయిలు సుమారు రూ.16కోట్లను వెంటనే ఇవ్వాలన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

నరసాపురం రూరల్, మార్చి 25: గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం మండలంలోని పీఎంలంక గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తండ్రి, కొడుకులు ఓట్లను అభ్యర్థించారు. మళ్లీ వైసీపీ అధికారంలో వస్తే మరింత సంక్షేమాన్ని అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుమాని నాగరాజు, బర్రె వెంకటరమణ, దొంగ మురళీ, ఆండ్రాజు చల్లారావు, రాధకృష్ణ పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

నరసాపురం టౌన్, మార్చి 25: అనారోగ్యాలతో బాధపడుతున్న బాధితులకు కొవ్వలి ట్రస్టు తరుపున నెలవారీ నిత్యావసర వస్తువుల్ని అందించారు. వీటిని టీడీపీ నాయకులు, ట్రస్టు ఛైర్మన్ కొవ్వలి నాయుడు బాధిత కుటుంబాలకు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంకు భాస్కర్, మల్లాడి మూర్తి, బాబు పాల్గొన్నారు.

మధ్యస్థంగా రహదారి పనులు

నరసాపురం రూరల్, మార్చి 25: మండలంలోని లక్ష్మణేశ్వరం నుంచి వేములదీవి గ్రామం వరకు నిర్మించిన సీసీ రహదారి పనులు మధ్యస్థంగా నిలిచిపోయాయి. దీంతో ఈ మార్గం గుండా వాహనదారులు ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్య మార్గంలో సగం వదిలిపెట్టేయడం వల్ల రాత్రి సమయంలో రోడ్డు కనిపించకపోవడం గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పనుల్ని వెంటనే పూర్తి చేయాలని తీర ప్రాంత వాసులు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

నరసాపురం రూరల్, మార్చి 25: మండలంలోని తీర ప్రాంత ప్రజలకు తాగునీటి ఇక్కట్లు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు అర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేశ్ చెప్పారు. లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు, రుస్తుంబాదా భారీ మంచినీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నీటితో నింపామన్నారు. ఇటు పంచాయతీ చెరువుల్ని కూడా నింపుకోవాలని కార్యదర్శుల్ని ఆదేశించామన్నారు. ఎక్కడైన తాగునీటి ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియజేయాలని విన్నవించారు.

పోలీసులు వాహనాల తనిఖీ



నరసాపురం, మార్చి 25: ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. కోనసీమ జిల్లా నుంచి రేవు దాటి వస్తున్న వాహనాలను నిలుపుదల చేసి తనిఖీ చేశారు. మద్యంతో పాటు నగదు తరలింపుపై గట్టి నిఘా ఉంచాలన్న ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ స్వామి సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు వస్తున్న ప్రతి వాహనాన్ని నిలుపుదల చేసి సోదాలు చేశారు.

శ్రీనివాస వర్మ ఎంపిక పట్ల హర్షం



మాట్లాడుతున్న పాలకొల్లు పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్

పాలకొల్లు టౌన్, మార్చి 25: నరసాపురం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ ఎంపిక కావడం పట్ల పాలకొల్లు పట్టణ బీజేపీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు పాలకొల్లులో పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగిన బీజేపీ ముఖ్యనాయకుల సభలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్ల మెంట్ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మను, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నిమ్మల రామానాయుడు విజయానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరం కలిసి కట్టుగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి కొల్లికొండ ప్రసాద్, బోడ కనకరాజు, కొల్లి నరసింహమూర్తి, చందాని లక్ష్మీనారాయణ, బేతిరెడ్డి మల్లిఖార్జున్, గవర పవన్ తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల్లో మురుగు నీరు



కుళాయిలో వచ్చిన మురుగు నీరు

యలమంచిలి, మార్చి 25: మండలం లోని కాజ పడమర గ్రామంలో మూడు రోజులుగా కుళాయిల ద్వారా మురికినీరు సరఫరా అవుతోందని స్థానికులు వాపోతు న్నారు. దీంతో తాగేందుకు నీరు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సురక్షితమైన తాగునీరు సరఫరా కావాల్సిన కుళాయిల ద్వారా బురద రంగులో ఉన్న నీరు రావడంతో వీటిని తాగితే రోగాల బారిన పడాల్సి వస్తుందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 8 కిలోమీటర్ల దూరంలోని పాలకొల్లు పట్టణం నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతు న్నారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషితమైన నీరు కనీసం ఇంటి అవసరాలకు వినియోగించేందుకు పనికిరావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.









తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి సమక్షంలో జనసేనలో చేరిక.. తణుకులో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లికి బీజేపీ నాయకుల మద్దతు.. వీరవాసరం ఆత్మీయ సమావేశంలో జనసేన అభ్యర్థి అంజిబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి.. కాపవరంలో ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర ప్రచారం

రాష్ట్ర సుభిక్షానికి కూటమిని గెలిపించాలి: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 25: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కూటమిని గెలిపించాలని జనసేన తాడేపల్లిగూడెం కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. కొండ్రుప్రోలులో ఆదివారం రాత్రి వైసీపీ నాయకుడు బొట్టా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ జగన్ అయిదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడటంతో పాటు ప్రజల ఆర్థిక స్థితిగతులు దయనీయంగా మారాయన్నారు.

జనసేనలో చేరిక

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 25: కుదుళ్ల శ్రీనివాస్, పెనుబోతుల సోమాలమ్మ ఆధ్వర్యంలో జట్లపాలెం గ్రామానికి చెందిన పలువురు జనసేన కార్యాలయంలో బొలిశెట్టి సమక్షంలో పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు పుల్లా బాబి, శెట్టి రాజు, శెట్టి సుధారాణి, వరప్రసాద్ పాల్గొన్నారు.

పెంటపాడు: వైసీపీ అరాచక పాలనను అడ్డుకోవాలంటే కూటమిని తప్పనిసరిగా గెలిపించాలని నియోజకర్గ జనసేన, టీడీపీ, బీజేపీ ఇన్‌చార్జ్‌లు బొలిశెట్టి శ్రీనివాస్, వలవల బాబ్జి, ఈతకోట తాతాజీ కోరారు. సోమవారం మండలంలోని రాచర్లలో పల్లెపోరు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి తదితరులు పాల్గొన్నారు.

ఆరిమిల్లికి బీజేపీ శ్రేణుల మద్దతు

తణుకు, మార్చి 25: తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణకు నియోజకవర్గంలోని బీజేపీ శ్రేణులు సంఘీభావం ప్రకటించాయి. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి వెంకట రామారావు రేలంగిలోని తన నివాసంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణను ముఖ్య అతిథిగా ఆహ్వానించి బీజేపీ శ్రేణులు ఆరిమిల్లి గెలుపు కోసం మనస్ఫూర్తిగా పనిచేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ పొత్తు ధర్మాన్ని పాటిస్తూ మద్దతు తెలిపిన పసుపులేటికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, మేక చంద్రమౌళి, మానే భాస్కరరావు, చుక్కా సాయిబాబా, గూడూరి నాగరాజు, కామన ఏడుకొండలు, కాసగాని రామకృష్ణ, అడ్డాడ మంటారావు, కర్రి శ్రీధర్‌రెడ్డి, వల్లూరి ఝాన్సీ పాల్గొన్నారు.

అంజిబాబును అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాం

వీరవాసరం, మార్చి 25: భీమవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం వీరవాసరం మండల టీడీపీ సమావేశాన్ని తులసి కన్వెన్షన్‌లో మండల శాఖ అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు హాజరయ్యారు. మండలంలోని పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా నేలపోగుల, తోకలపూడి, వడ్డిగూడెం, తదితర గ్రామాల నుంచి టీడీపీ, జనసేనలోకి చేరారు. సమావేశంలో టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామ లక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(బాబు), ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, కోశాధికారి మెంటే పార్థసారథి, వేండ్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి టీడీపీ కృషి: ఎమ్మెల్యే నిమ్మల

పాకొల్లు రూరల్, అర్బన్, మార్చి 25 : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పాలకొల్లు నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ నిమ్మల రామానాయుడు మండలంలోని కాపవరం గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌తో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తన సొంత గ్రామం కాపవరంలో ఇంటింట ప్రచారంలో పాల్గొని మాట్లాడుతూ రానున్నది ఉమ్మడి కూటమి ప్రభుత్వమేనని అన్నారు. రామానాయుడు మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా సామాజిక పరంగా ఎదగాలంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోలాటి రాధ, పార్టీ నాయకులు అంగర వీరభద్రకుమార్, బంగారాజు, దుర్గరాజు, రంగరాజు అంగర వరప్రసాద్, గూడూరి నరసింహమూర్తి, కొత్తలంక లక్ష్మీనారాయణ, పాలా విజయకుమారి, మాదాసు లలిత కుమారి పాల్గొన్నారు.

యలమంచిలి: నిరంతరం ప్రజలతో మమేకమై పనిచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడును మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి అన్నారు. కాజ పడమర గ్రామంలో నిమ్మల సూర్యకుమారి టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల పేరుతో సీజనల్‌గా వచ్చే వైసీపీ నాయకులను నమ్మవద్దని అన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి చిత్త శుద్ధితో పనిచేసే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు.



మొయ్యేరులో జనసేనలోకి ఆహ్వానిస్తున్న పత్సమట్ల

జగన్‌ను సాగనంపాలి: పత్సమట్ల

గణపవరం, మార్చి 25: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి జరిగిన నష్టాలన్ని ప్రజలందరికి వివరిస్తూ జగన్‌ను సాగనంపాలని ఉంగుటూరు జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. సోమవారం మొయ్యేరు గ్రామంలో 30 మందికి జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మూడు పార్టీల కార్యకర్తలు సమన్వయ ంతో ప్రచారం చేయాలని పవన్‌కల్యాణ్ ఆశయం నెరవే ర్చాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, మొయ్యేరు టీడీపీ అధ్యక్షుడు కానుమిల్లి చంటి, మండల జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు, జనసేన గ్రామాధ్యక్షుడు కొల్లేపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.







పాలకోడేరు, భీమవరం, గణపవరంలలో హోలీ వేడుకలు

వేడుకగా రంగుల హోలీ

భీమవరం టౌన్/ పాలకోడేరు/ఆకివీడు/ పాలకొల్లు టౌన్/గణపవరం, మార్చి 25 : చిన అమిరం గ్రామంలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో ది భీమవరం మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో హోలీ వేడుక నిర్వహించారు. రాజస్థానీ సంప్రదాయమైన డప్పువాయిద్యాలు, యువకుల కర్ర విన్యాసాలు చేశారు. రంగులు చల్లు కుంటూ సాంప్రదాయ బద్ధంగా హోలీ వేడుకను నిర్వహించుకున్నారు. మహిళలు , చి న్నారులు ఈ ఉత్సవంలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ హోలీ దినోత్సవాన్ని అధర్మం మీద ధర్మం గెలిచిన రోజు అని, హోలిక అనే రాక్షసి సంహారం జరిగిన రోజు హోలికా దినోత్సవంగా నిర్వహిస్తూ వస్తున్నారని, ఈ హోలీ వేడుకలు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రాంతాలకే పరిమితం కాకుండా మన ప్రాంతంలో కూడా విస్తరించాయని, మన ప్రాంతాల్లో కూడా ఈ పండుగలు, వేడుకలు నిర్వహిస్తున్న మార్వాడి సమాజ్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆ ప్రాంతంలో మార్వాడి కుటుంబాల వారు అల్పాహారం పంపిణీ చేశారు. పాలకోడేరు మండలంలోని అన్ని గ్రామాలలో చిన్న పిల్లలు, యువత ఘనంగా హోలీ పండుగ చేసుకున్నారు. సంస్కృతి సాంప్రదాయాల పండుగగా వచ్చిన ఈ హోలీ పండుగ ప్రతీ ఒక్కరిలో ఆనందాలను నింపాలని కోరుతూ హోలీ పండుగను కలర్‌ఫుల్‌గా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విస్సాకోడేరు సెయింట్ జాన్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగులను పూసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆకివీడులో చిన్నారులు, యువత రంగు నీళ్ళు చల్లుకుని ఆనందోత్సాహాలతో హోలీ పండుగ జరుపుకున్నారు. పాలకొల్లులో హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. హోలీ సందర్భంగా యువత చిన్నారులు ఉత్సాహంగా ఒకరు మీద ఒకరు రంగులు జల్లుకుని పండుగ విశిష్టతను చాటారు. గణపవరంలోని వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో అధ్యక్షులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు అల్లూరి గంగరాజు చిన్నారులతో హోలి సంబరాలు నిర్వహించారు. సంతమార్కెట్ ఏరియాలో ఉంటున్న బిక్షగాళ్ల పిల్లలతో వేడుకలు చేపట్టారు.

చెత్త తొలగించారు...



వాటర్ ట్యాంకు వద్ద శుభ్రం చేస్తున్న సిబ్బంది

పెంటపాడు, మార్చి 25: 'వాటర్ ట్యాంకులు... చెత్తకు నిలయాలు' శీర్షిక న 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పెంటపాడు గ్రామంలోని సంతమార్కెట్ వద్ద ఉన్న వాటర్‌ట్యాంకు వద్ద చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు. అలాగే గ్రామంలోని కుమ్మరిపుంత రహదారిలో ఉన్న వాటర్ ట్యాంకు వద్ద టీడీపీ వార్డు సభ్యుడు నల్లమిల్లి చినగోపిరెడ్డి, పంచాయతీ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ట్యాంకు సమీపంలో చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు.

జువ్వలపాలెంలో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు

పెంటపాడు, మార్చి 25: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్తిపాడు త్రీ ఎఫ్ ఇండస్ట్రీ రామేశ్వర్ బాలకృష్ణ గోయెంకా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సంస్థ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని జువ్వలపాలెంలో ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, దీని వల్ల సుమారు 600 కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం జరుగుతుందన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 25: మెట్ట ఉప్పరగూడెంలో ఉపాధి పనిచేస్తున్న కూలీ మార్లపూడి సాల్మన్ (60) గుండెపోటుతో కుప్పకూలాడు. అత్యవసర వైద్యం అందించేందుకు ఆర్‌ఎంపీ వైద్యుల వద్దకు తీసుకెళ్లే సరికి మృతి చెందినట్టు స్థానిక వైద్యులు నిర్ధారించారు. సాల్మన్ మృతికి ఉపాధి కూలీల సంఘ నాయకులు నివాళులర్పించారు. అతని కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మండలంలో మంత్రి పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 25: తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను. జగన్నాథపురం, కృష్ణాయపాలెం గ్రామాల్లో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సోమవారం పర్యటించారు. గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై ఎన్నికల్లో పార్టీ విజయానికి పనిచేయాలని కోరారు.

మాధవరంలో అమ్మవార్ల జాతర

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 25: మిలిటరీ మాధవరంలో పోలేరమ్మ, కనకవయ్యారమ్మ, తుదుపులమ్మ, మహంకాళమ్మ, మహాలక్ష్మమ్మ, దండు మారెమ్మ, రణగంగమ్మ, పోతురాజు జాతర సందర్భంగా ఆగం వేడుక సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవార్ల గరగలను ఊరేగించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అమ్మవార్లకు పూజలు చేశారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

పాలకొల్లు అర్బన్, మార్చి 25: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని నియోజక వర్గ సమన్వయ కర్త కొలుకులూరి అర్జునరావు అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని పలు వార్డులు, పూలపల్లి, చందపర్రు గ్రామాల్లో ప్రచారం చేసి కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను వివరించారు.

శ్రీరంగసాయి స్వామి వార్షికోత్సవం

ఉండి, మార్చి 25: ఎస్‌ఆర్‌పిఅగ్రహారంలోని శ్రీరంగసాయి స్వామి 9వ వార్షికోత్సవం కార్యక్రమం జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, మాజీ ఉపసర్పంచ్ యడ్ల శ్రీను, బురిడి రవిబాబు, భాగ్యలక్ష్మీ దంపతులు, కాశీ, వెంకన్న పాల్గొన్నారు.

కోమర్రులో మారెమ్మ ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ

గణపవరం, మార్చి 25: కోమర్రులో మారెమ్మ అమ్మవారి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సోమవారం జరిగిన కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయాన్ని గ్రామస్థులు పునఃనిర్మించారు. ఉంగుటూరు నియోజకవర్గ జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దర్శించుకున్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

కాళ్ళ, మార్చి 25 : కాళ్ళ మండలంలో జిల్లా జాయింట్ కలెక్టర్, ఉండి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య సోమవారం పర్యటించారు. పెదఅమిరం గ్రామంలో - 5, కోపల్లె గ్రామంలో -4, వేంపాడు గ్రామంలో - 2తో కలిసి 11 పోలింగ్ బూత్‌లను జిల్లా జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ బూత్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, తదితర సౌకర్యాల కల్పనపై సెక్టోరల్, నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

ఓటు వేయడం సామాజిక బాధ్యత



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సీసీఎస్ డీఎస్పీ యుగేంద్ర, తదితరులు

భీమవరం టౌన్, మార్చి 25 : ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ప్రతి పౌరుని సామాజిక బాధ్యత అని సీసీఎస్ డీఎస్పీ ఎన్.యుగేంద్ర బాబు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సీసీఎస్ డీఎస్పీ కార్యాలయంలో ఓటు విలువ,ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ యుగేంద్ర బాబు మాట్లాడుతూ ఓటు వేసేటప్పుడు ఆలోచించాలని, సుస్థిరపాలనకు సమర్థవంతులను ఎన్నుకోవడం ఓటుపై ఆధారపడి ఉంటుందని అన్నారు. నైతిక విలువలతో ఓటు వేసి ప్రజాస్వా మ్యా న్ని పరిరక్షించాలని అన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, ఏఎస్సై పీవీ శ్రీనివాస్ రావు, కానిస్టేబుల్స్ కే సత్యనారాయణ, వీవీ రాజు, బుచ్చిరాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎస్ కే చాన్ బాషా పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వితరణ



కుట్టు మిషన్లు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్, మార్చి 25 : లయన్స్ క్లబ్ రీజినల్ మీట్ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ పలు సేవా కార్యక్రమాలు చేట్టారు. స్థానిక లయన్స్ క్లబ్ హాల్లో ఆనందజ్యోతిర్మయం పేరుతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.మాణిక్యాలరావు చేతుల మీదుగా రూ. 5.30 లక్షల విలువైన కుట్టు మిషన్లు, గ్రైండర్లు, సైకిళ్ళు ఆర్థికంగా వెనుకబడిన వారికి అందజేశారు.

ఆంజనేయస్వామికి పూజలు

పాలకోడేరు, మార్చి 25 : పెన్నాడ గ్రామంలోని వీరాంజనేయస్వామి 23వ వార్షికోత్సవం సందర్భంగా ఉండి మాజీ ఎమ్మెల్యే, ఉండి నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు సోమవారం స్వామివారిని దర్శంచుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చండీహోమం



మావుళ్ళమ్మ ఆలయంలో చండీ హోమం

భీమవరం టౌన్, మార్చి 25: పౌర్ణమి సందర్భంగా మావుళ్ళమ్మ ఆలయంలో చండీహోమాన్ని సోమవారం నాడు నిర్వహించారు. 78 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌తోపాటు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

కాళ్ళ: బొండాడ గ్రామంలో పోలేరమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయం వద్ద సోమవారం మహాచండీ హోమం నిర్వహించారు. అమ్మవార్ల 49వ జాతర మహోత్సవాలలో భాగంగా ఆలయం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామ సర్పంచ్ మన్నే వరలక్ష్మీ, నాగరాజు దంపతులు, భక్తులచే హోమం నిర్వహించారు. అమ్మవార్లని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స శిరీష, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా సోమవారం చండీ హోమం నిర్వహించారు. 26 మంది దంపతులు పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు స్వామివారి శేష వస్త్రాలను, చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు.

పౌర్ణమి పూజలు



భీమవరం బాలా త్రిపురసుందరీ అమ్మవారికి అలంకరణ

భీమవరం టౌన్, మార్చి 25: పౌర్ణమిని పురస్కరించుకుని భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పుష్పాలంకరణ చేశారు. గ ణేశల ఆనందరావు, ఉమాదేవి దంపతులచే అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ఆలంకరణ చేశారు.

ఆకివీడు: పౌర్ణమి సందర్భంగా స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి, మాదివాడ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పార్వతీకి అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అన్న సమారాధన



మొగల్తూరు, మార్చి 25: మహ శివరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఈసమారాధనలో వేలాదిగా భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

షిరిడిసాయి విగ్రహాల ఊరేగింపు

మొగల్తూరు, మార్చి 25: రామాలయం వీధిలో నిర్మించిన దత్తసాయి మందిరంలో ఈనెల 28న ప్రతిష్ఠ నిర్వహించే దేవతామూర్తుల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. షిరిడి సాయిబాబా, దత్తసాయి, సాయి పాదుకలు, నాగేంద్రస్వామి, శ్రీసప్త శిరోవిరాజిత ఫణీంద్ర విగ్రహాలను బాణ సంచా కాల్పులు, మేళ తాళాలు, కోలాట నృత్యప్రదర్శనలు చేస్తూ ఊరేగించారు.

శివ, కేశవ విగ్రహాల ప్రతిష్ఠ



కాళ్ళ, మార్చి 25 : దొడ్డనపూడి గ్రామంలో పార్వతి సమేత చంద్రమౌళీశ్వరస్వామి, భూసమేత చెన్నకేశవస్వామి పరివార దేవతా విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్, ఈవో కూచంపూడి శ్రీనివాసరాజు తదితరులు పర్యవేక్షించారు.

అన్నసమారాధన

పోడూరు, మార్చి 25: పోడూరులోని శ్రీమూలేశ్వరస్వామి, రాజేశ్వరస్వామి, కేశవస్వామి వార్ల పంచాహ్నిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. దేవస్థానం చెర్మన్ పోడూరి సత్యసాయిబాబా, ఈవో తోట శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.